క్లుప్తంగా

నైట్ శానిటేషన్ వర్కర్లకు వేతన కష్టాలు

ఆరిలోవ : బీఆర్‌టీఎస్‌లో పనిచేస్తున్న నైట్ శానిటేషన్ వర్కర్లకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. దీంతో పారిశుధ్య కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. హనుమంతవాక నుంచి అడవివరం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో సంజయ్‌గాంధీ కాలనీ (అన్న క్యాంటీన్) నుంచి దీన్‌దయాల్ పురం వద్ద స్కిల్ డెవలప్‌మెంట్ కూడలి వరకు 15 మంది కార్మికులు నైట్ శానిటేషన్ పనులు చేస్తున్నారు. వాళ్లకు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇంత వరకు వేతనాలు చెల్లించ లేదు. దీంతో వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.13,500 చొప్పున వేతనాలు చెల్లించాల్సి ఉంది. నెలవారీ వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు వడ్డీలకు అప్పులు వాడాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి తమకు బకాయిపడిన వేతనాలు చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు.

కోస్టల్ టూరిజంతో అభివృద్ధి



కెప్టెన్ యోగేష్‌ను సత్కరిస్తున్న హెచ్‌వోడీలు

మద్దిలపాలెం : ఆంధ్రా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆంధ్ర ఆధ్వర్యంలో బుధవారం కోస్టల్ టూరిజంపై అతిథి ఉపన్యాసాన్ని పీటర్ డక్కర్ స్మార్ట్ సెమినార్ హాలులో నిర్వహించారు. ఇండియన్ మారిటైం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ కెప్టెన్ యోగేష్ చంద్రలాల్ షా అతిథోపన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 13 పెద్ద నదులు ఉన్నాయని... ఆ నదులను సముద్రానికి అనుసంధానం చేస్తూ రవాణా వ్యవస్థను, టూరిజాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. అలా చేస్తే గ్రామాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయన్నారు. అనంతరం కెప్టెన్ యోగేష్ చంద్రలాల్ షాను విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య ఘనంగా సత్కరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో కేబుల్ వైర్లు దగ్ధం



బలరామ్ నగర్‌లో కాలిపోతున్న కేబుల్ వైర్లు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు బలరామ్ నగర్‌లో విద్యుత్ స్తంభాలకు కట్టిన కేబుల్ వైర్లు బుధవారం రాత్రి ఆకస్మికంగా దగ్ధమయ్యాయి. ఈ కాలనీలో కేబుల్ కనెక్షన్లకు సంబంధించిన వైర్లు ఎక్కువ మోతాదులో విద్యుత్ స్తంభాల మీదుగా వేశారు. ఆ కేబుల్ వైర్ల మధ్యలో ఓ పిచ్చుక గూడు ఉంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఆ పిచ్చుక గూడు అంటుకుని మంటలు చెలరేగి కేబుల్ వైర్లు కాలిపోయాయి. వెంటనే స్థానికులు అధికారులకు సమాచారమివ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపేసి మంటలు అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



రోడ్డు మధ్యలో రాకపోకలకు అడ్డంకిగా నిర్మాణ సామగ్రి, యంత్రాలు



కళాభారతి రోడ్డులో రాకపోకలకు అడ్డంకిగా మట్టి కుప్పలు



పిఠాపురం కాలనీ రోడ్డులో తొలగించిన భారీ వృక్షం

అభివృద్ధి పేరిట విధ్వంసం



పచ్చని చెట్లు నరికి కుప్పలుగా వేసిన కొమ్మలు

- జీవీఎంసీ 22వ వార్డులో పచ్చని చెట్లపై వేటు
- రోడ్లపైనే కాలువల కోసం తవ్విన మట్టి
- కాలనీలకు వెళ్లే మార్గాల మూసివేత
- రాకపోకలకు వీలులేక మండిపడుతున్న కాలనీలవాసులు

మద్దిలపాలెం : అభివృద్ధి పేరుతో జీవీఎంసీ 22వ వార్డులో విధ్వంసం సృష్టిస్తున్నారు. చిన్న కాలువల నిర్మాణానికి పచ్చని చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికేశారు. ప్రభుత్వ ఆస్తులైన విద్యుత్ స్తంభాలను పొక్లెయిన్‌తో నేల మట్టం చేసేశారు. మరోవైపు కాలువ నిర్మాణం పేరుతో కాలనీలకు వెళ్లే మార్గాల మధ్య గోతులు తవ్వి నిర్మాణం పూర్తి చేయకుండా వదిలేశారు. తవ్విన మట్టి రోడ్లపై కుప్పలు కుప్పలుగా వేసేశారు. నిర్మాణాలకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా వాటిని పొక్లెయిన్‌తో విరగ్గొట్టేశారు. కాలువల నిర్మాణం పేరుతో జరుగుతున్న ఈ విధ్వంసాన్ని చూసిన వార్డు వాసులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంత దారుణ పరిస్థితి నగరంలోని ఏ వార్డులోనూ చూడలేదంటున్నారు. ఆహ్లాదాన్ని అందిస్తూ, చిన్నారుల ఆటపాటలతో కళకళలాడే పార్కును ఇప్పటికే అభివృద్ధి పేరిట ధ్వంసం చేసేశారు. బలంగా ఉన్న ప్రహరీని కూలగొట్టి నాసిరకంగా పిట్టగోడను అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. పార్కును చూసిన పాదచారులు, కాలనీవాసులు చలించిపోతున్నారు. ఎవరి ప్రాపకం కోసం ఇంత విధ్వంసం చేస్తున్నారంటూ కాలనీవాసులు మండిపడుతున్నారు.

పచ్చని చెట్లను తెగనరికేసి...

పిఠాపురం కాలనీ రోడ్డు పక్కన భారీ వృక్షాలు చక్కగా నీడనిచ్చేవి. ఈ చెట్లు ఏన్నో సంవత్సరాల నుంచి చల్లని గాలిని, మండు వేసవిలో సైతం నీడ నిచ్చేవి. అటువంటి భారీ వృక్షాలు తొలగించడంతో ఆ ప్రాంతం బోసిపోయింది. పిఠాపురం కాలనీలోని అభిరుచి హోటల్ దగ్గర సుమారు 50 ఏళ్ల వయసున్న మద్ది చెట్టును నిలువునా నరికేశారు. ఈ చెట్టు నీడలోనే అక్కడి చాలా ప్రాంతం ఉండేది. అటువంటి చెట్టు కొమ్మలు పూర్తిగా తొలగించేసి బోడిగా మార్చేశారు. కళాభారతి ఆడిటోరియం వద్ద, పార్కు వద్ద గల అనేక చెట్లను నరికేసి వాటి కొమ్మలు, వ్యర్థాలను రోడ్డుపై కుప్పలుగా పడేశారు. పిఠాపురం కాలనీలో ప్రత్యేక ఆకర్షణగా ఉండే వృక్షాలు నేలకొరగడం చూసిన కాలనీ వాసులు జీవీఎంసీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా కేవలం చిన్న కాలువ నిర్మాణానికి చేస్తున్న విధ్వంసమని తెలిసి విస్తుపోతున్నారు. కాంట్రాక్టర్లు కాసుల కోసం చేస్తున్న నిర్మాణాలపై అధికారులు ఇంత ప్రేమ ఎందుకు చూపిస్తున్నారంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు.

కాలనీవాసుల రాకపోకలకు అవస్థలు

కాలువ నిర్మాణం కోసం తవ్విన మట్టిని రోడ్డుపై ఇష్టానుసారంగా కుప్పలుగా వేసేశారు. వాటిని తప్పించుకుని రాకపోకలు సాగించడం వాహన చోదకులు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. అయినా పట్టించుకునే వారు లేరంటూ కాలనీవాసులు మండిపడుతున్నారు. మరోవైపు కాలువ నిర్మాణానికి సంబంధించి సిమెంట్ మిక్సింగ్ మిషన్, పొక్లెయిన్, ఇతర యంత్రాలతోపాటు, చిప్పురాళ్లు, ఇసుక కుప్పలు రోడ్డుపై అడ్డంగా వేసేశారు. ఇవి ఒకవైపు, మరోవైపు మట్టి కుప్పలను దాటుకుని రాకపోకలు సాగించడం పిఠాపురం కాలనీ వాసులకు పెద్ద తలనొప్పిగా మారింది.

నాసిరకంగా పనులు

చెట్లన్నీ నరికేసి కాలువ నిర్మిస్తున్నప్పటికీ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, నాసిరకంగా పనులు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు కాంక్రీట్ నిర్మాణాలపై 21 రోజులపాటు వాటరింగ్ చేపట్టాల్సి ఉన్నప్పటికీ నిబంధనల మేరకు వాటరింగ్ చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్ చేతివాటం చూపిస్తున్నారని, మొక్కుబడిగా వాటరింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ నిర్మాణాలపై జీవీఎంసీ ఉన్నతాధికారులు ఆరా తీసి తగిన చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కాలనీల రోడ్ల మధ్యలో గోతులు



రజకవీధి మార్గంలో తవ్వి వదిలేసిన గొయ్యి

పిఠాపురం కాలనీలోని ఇతర కాలనీల కనెక్టింగ్ రోడ్ల మధ్యలో కాంట్రాక్టర్ గోతులు తవ్వి వదిలేశారు. దీంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా తవ్విన ప్రాంతంలో ముందస్తుగా పనులు పూర్తి చేసి ఆ మార్గాన్ని పునరుద్ధరించి స్థానికుల రాకపోకలకు వీలు కల్పించాలి. అలాంటిది కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నా పనులు చేయకుండా తాత్సారం చేస్తున్నారు. దీంతో వాహనచోదకులు, పాదచారులు కాంట్రాక్టర్ తీరుపై నిప్పులు చెరుగుతున్నారు. రజకవీధిలోకి వెళ్లే మార్గాన్ని కాలువ నిర్మాణం ప్రారంభంలో తవ్వేశారు. ఇప్పటికి నాలుగు వారాలు కావస్తున్నా ఇప్పటికీ పనులు చేపట్ట లేదు. దీంతో కావాలనే మా కాలనీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మా కాలనీపై వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తున్నారు.



అధికారులు, కాంట్రాక్టర్ విధ్వంసంతో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం



పెదగదిలి వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ : స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహమాన్ కోరారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా బుధవారం బీఆర్‌టీఎస్ రోడ్డులో పెదగదిలి కూడలి వద్ద సీపీఐ ఆరిలోవ జోన్ నాయకులు ఎర్ర జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై భారం మోపే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి నాయకులు... అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతోపాటు ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో ఇంతవరకు మూడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని మోపారని ఆరోపించారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీల పెరుగుదలను తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబునాయుడు ఇప్పుడు విచ్చలవిడిగా పెంచుకుపోతున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా దీనికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దేవుడమ్మ, కాసుబాబు, లక్ష్మణరావు, రవి, సందీప్, రాజు, రమణ పాల్గొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కుట్టు శిక్షణ



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేంద్రం పరిశోధనా విభాగం ఇన్‌చార్జ్ పద్మ

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కేంద్రాన్ని విజ్ఞాన కేంద్రం పరిశోధనా విభాగం ఇన్‌చార్జి కె.పద్మ బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 10 కుట్టు మిషన్లతో ఈ కేంద్రం ప్రారంభమైందని, డిమాండ్‌ను అనుసరించి మిషన్ల సంఖ్య పెంచుతామని చెప్పారు. విజ్ఞాన కేంద్రం సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రారంభమైన ఈ శిక్షణ, మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందన్నారు. కేంద్రం కార్యక్రమాల కమిటీ కన్వీనర్ జీఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రజల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరాలు, ఫ్రీ క్లినిక్ నిర్వహించడమే గాక కంప్యూటర్ శిక్షణ కూడా అందిస్తోందన్నారు. వాటికి టైలరింగ్ శిక్షణ కూడా తోడైందని, పరిసర ప్రాంతాల మహిళలు టైలరింగ్ శిక్షణ పొందేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 83309 48949 నంబరులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు బుజ్జి, శిక్షకురాలు పి.ఎస్.మణి, ఎమ్మర్శి రాజు, వై.సత్యనారాయణ, కె.మణి తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే నవ సమాజ నిర్మాణం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, బులయ్య కళాశాల అధ్యాపక బృందం

సీతంపేట: 'నవ సమాజ నిర్మాణం రేపటి భారతదేశానికి విప్లవాత్మక మేల్కొలుపు' అనే అంశంపై స్థానిక బుల్లయ్య కళాశాలలో బుధవారం ప్రేరణాత్మక సెషన్ జరిగింది. ముఖ్య అతిథి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం అనేది చర్యకు పిలుపుని, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. నగరం మధ్యలో ఉన్న బుల్లయ్య కళాశాలలో సుమారు 7 వేల మంది విద్యార్థులున్నారని, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇటీవల కాలంలో సైబర్ నేరాల బారిన పడి చాలా మంది మోసపోతున్నారన్నారు. సరదాకో, స్నేహితులు బలవంతం చేశారనో డ్రగ్స్ తీసుకోవడం వల్ల విద్యార్థుల జీవితాలు నాశనమవుతున్నాయని, తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు నిరాశకు గురవుతున్న సంఘటనలు నిత్యం మనం చూస్తున్నామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల ఉచ్చులో యువత పడకుండా లక్ష్యంపై దృష్టి సారించాలన్నారు. మహిళలపై హింస, ట్రాఫిక్ క్రమశిక్షణ రాహిత్యానికి వ్యతిరేకంగా ఒక యుద్ధం చేద్దామని పిలుపునిచ్చారు. విశాఖ మహా నగరంలోని ప్రతి పౌరుడిలో వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి, ధైర్యం నింపడానికి, తమ బాధ్యతలు గుర్తుచేసుకునేందుకు ఇటువంటి ప్రేరణ సెషన్లు దోహదపడతాయని చెప్పారు. అనంతరం దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, మహిళలపై హింసకు పాల్పడమని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జోన్-4లో వాణిజ్య దుకాణాలకు 23న బహిరంగ వేలం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-4 పరిధిలోని పలు వాణిజ్య సముదాయాలకు సంబంధించి ఈ నెల 23న ఉదయం జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు ప్రకటనలో తెలిపారు. సూర్యాబాగ్ డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం, జగదాంబ వాణిజ్య సముదాయం, పాత బస్టాండ్ దుకాణాలు, పద్మానగర్ వాణిజ్య సముదాయం, సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం, టీఎస్ఆర్ వాణిజ్య సముదాయం, అంగటిదిబ్బ వాణిజ్య సముదాయంలో కొన్ని దుకాణాలు, జీవీఎంసీ మెయిన్ ఆఫీస్ క్యాంటీన్, అంబేడ్కర్ కల్యాణ మండపం, రెల్లివీధి రోడ్‌సైడ్ ఫిష్ మార్కెట్ 3 ఏళ్ల కాలానికి బహిరంగ వేలం ద్వారా ఇవ్వనున్నట్టు జోనల్ కమిషనర్ తెలియజేశారు. వేలంలో పాల్గొనదలచే వారు డిపాజిట్ సొమ్ము, పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయ పని వేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని సూచించారు.

'అర్థ నూటపదహార్లు' పుస్తకావిష్కరణ

సీతంపేట: తాతాభక్తుల లక్ష్మీప్రసాద్ రచించిన 'అర్థ నూటపదహార్లు' పద్య సంపుటి పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. స్వరరాగ సుధ లలిత భక్తి గీతాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్ దాస్ ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న పద్య ప్రక్రియను తన వంతు కర్తవ్యంగా భావించి అలతి అలతి పదాలతో పద్య సంపుటి రచించి, ఆటవెలది వృత్తంలో మనకు అందించారని రచయితను అభినందించారు. డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ ఈ పద్య సంపుటిని అర్థ నూటపదహార్లతో క్లుప్తీకరించకుండా, నూట పదహార్లుగా రాయాలని సూచించారు. డాక్టర్ కొచ్చెర్లకోట వెంకట సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సామాజిక రుగ్మతలను, మూఢవిశ్వాసాలను స్పృశిస్తూ ఆటవెలది పద్యాలు రాయడం వేమనను గుర్తుచేశాయని కొనియాడారు. పద్య కవి చిన్నసూరి రచయితను అభినందించారు. అనంతరం లక్ష్మీప్రసాద్ పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. మేడా మస్తాన్‌రెడ్డి నిర్వహణలో జరిగిన ఈ సభలో స్వరరాగ సుధ వ్యవస్థాపకులు పి.వి.పద్మిని పాల్గొన్నారు. గాయనీ గాయకులు కోరుకొండ రంగారావు, ధనలక్ష్మి, పూర్ణ, చంద్రకళ, సునీత పాడిన లలిత గీతాలు అలరించాయి.

సముద్ర తీరంలో ఎడారి ఓడ



సముద్ర తీరంలో సహజంగా ఓడలు కనిపిస్తాయి. ఎడారి ప్రాంతంలో ఇసుకపై సంచరించడానికి ఎడారి ఓడ (ఒంటె)లు కనిపిస్తాయి. అయితే సముద్ర తీరంలో ఇసుక తిన్నెలపై ఒంటెలు కనిపిస్తే కొంచెం వింతగా ఉంటుంది. విశాఖ సాగర తీరంలో నిత్యం ఒంటెపై సవారీ అందుబాటులో ఉంది. కొంత మంది ప్రత్యేకంగా ఒంటెలను పెంచుతూ సాగర తీరంలో సాయంత్రం వేళలో పర్యాటకులతో సవారీ చేయిస్తూ ఆదాయం సంపాదిస్తున్నారు. పర్యాటకులకు ఇది ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఒంటెలపై కూర్చుని సవారీ చేస్తూ, ఫొటోలు తీసుకుంటూ పర్యాటకులు సంతోషాన్ని పొందుతున్నారు. – ఏయూ క్యాంపస్

కూటమి ప్రభుత్వ మోసాలన్నీ ప్రజలకు చెప్పాలి

- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

ఆరిలోవ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను గడప గడపకు తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు కోరారు. జీవీఎంసీ పన్నెండో వార్డులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్క్రీన్‌పై ప్రదర్శించిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సందేశం కార్యకర్తలకు వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ చేపట్టనున్న 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో కార్యకర్తలంతా చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. 2024 సాధారణ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారన్నారు. ఎక్కువ మేలు చేస్తారనే ఆశతో కూటమి నాయకులను ప్రజలు ఓటేసి గెలిపించారన్నారు. అధికారం చేపట్టి ఏడాది గడిచినా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ మోసాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చంద్రబాబు, పవన్‌కు ప్రజలు బుద్ధి చెప్పేలా చైతన్యపరచాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, హేమంత్, మోహనరావు, సూర్యారావు, జ్యోతి ప్రకాష్, ఒమ్మి శ్రీను, మొల్లి అప్పలరాజు, సుజాత, కొండమ్మ, మక్బుల్, సత్యనారాయణ, శ్రీను, బుజ్జి, వెంకటప్పారావు, రాజు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అందుబాటులోకి వాష్‌రూమ్స్



ఏయూ ఫార్మసీ విభాగం విద్యార్థినుల కోసం నిర్మించిన ఆధునిక వాష్‌రూమ్



విద్యార్థినులు, ఆచార్యులతో ఏయూ పూర్వ విద్యార్థి దేవ పురాణం

మద్దిలపాలెం : ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి ఔదార్యంతో ఫార్మసీ కళాశాలకు అధునిక హంగులతో నూతనంగా నిర్మించిన వాష్‌రూమ్స్ అందుబాటులోకి వచ్చాయి. ఏయూ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ దేవ పురాణం తాను చదువుకున్న ఏయూకి సొంత నిధులు రూ.15 లక్షల వ్యయంతో వాష్‌రూమ్‌ను నిర్మించి బుధవారం అందజేశారు. తన తల్లిదండ్రులు శ్రీమతి లలితాదేవి పురాణం, కోటిలింగాల మూర్తి పురాణం పేరు మీదుగా ఏయూ విద్యార్థినులకు ఉపయుక్తంగా అనేక కార్యక్రమాలను దేవ పురాణం నిర్వహిస్తున్నారు. గతంలో ఫార్మసీ కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతి లేదన్న విషయం తెలుసుకుని నూతన హాస్టల్ నిర్మాణానికి అవసరమైన నిధులు అందించారు. అనంతరం రసాయన శాస్త్ర విభాగ సమావేశ మందిరాన్ని ఆధునికీకరించి విద్యార్థులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దారు. అమెరికాలో నివసిస్తున్నప్పటికీ భారతదేశం వచ్చిన ప్రతిసారీ ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శిస్తూ... ఇక్కడి అవసరాలు తెలుసుకుని సహకారం అందిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజాశంకర్ మాట్లాడుతూ ఫార్మసీ కళాశాల విద్యార్థినులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడానికి పూర్వ విద్యార్థి దేవ పురాణం ముందుకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆచార్య పి.శ్యామల, ఆచార్య వి.గిరిజాశాస్త్రి, ఆచార్య ఏకేఎం పవార్, ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, ఆచార్య పి.శైలజ, విద్యార్థినులు వాష్‌రూమ్స్‌ను పరిశీలించారు.